క్లుప్తంగా

నేడు తలే రాజేష్ నామినేషన్

సంతకవిటి: వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ బుధవారం నామినేషన్ వేయనున్నారని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అన్ని పంచాయతీల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై, అభ్యర్థి బలాన్ని చాటాలని కోరారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ


రికార్డులు పరిశీలిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. లబ్ధిదారులకు పక్కాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, బాలామృతం అందజేయాలన్నారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి


భక్తులనుద్దేశించి, ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణ

రేగిడి: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, సమాజ హితానికి ఇది చాలా మంచిదని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్.వి. రమణ అన్నారు. మండల కేంద్రంలోని దత్తపీఠంలో దివ్యజీవన సత్సంగ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రేతాయుగంలో భగవంతుడు మానవరూపంలో రాముడిగా అవతరించారని, అప్పట్లో సత్యం, ధర్మం, శాంతి, ప్రేమతో ప్రజలు జీవించేవారన్నారు. సంపాదనలో కొంతమొత్తాన్ని ఆధ్యాత్మిక, సత్సంగ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యన్నారాయణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం


శిబిరానికి వచ్చిన వారికి ఆయుర్వేద మందులు అందజేసిన వైద్యుడు సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ఆయుర్వేదం ఎంతగానో పనిచేస్తుందని, ఈ మందులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను వైద్యుడు కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


బూరాడ కూడలి వద్ద కారులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: ఎన్నికల వేళ పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలోని సంకిలి, బూరాడ, చిన్నశిర్లాం, ఉంగరాడమెట్ట కూడళ్ల వద్ద ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు అతిక్రమిస్తూ డబ్బు, మద్యం అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు. రూ.50 వేలు నగదు దాటి తరలిస్తే సంబంధిత ఆధారాలు పక్కాగా ఉండాలన్నారు.

26న ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

బాడంగి: మండలంలో ఈ నెల 26వ తేదీన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన అదేరోజు మధ్యాహ్నం వాడాడ, చినవాడాడ, కోటిపల్లి, మల్లంపేట, పాల్తేరు, బొత్సవానివలస, హరిజనపాల్తేరు, అల్లుపాల్తేరు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతల అభ్యర్థన


తెర్లాం: లింగాపురంలో ప్రచారంలో ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు


తెర్లాం: మోదుగువలసలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు


వంగర: తలగాంలో ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ ఉమామహేశ్వరరావు

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తలే రాజేష్‌ను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెర్లాం: మండలంలోని లింగాపురంలో బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు మద్దతుగా ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యే శంబంగిని, వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండలంలోని ఎస్.సీతారాంపురానికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీటీసీ శిష్టు గౌరునాయుడు, కర్రోతు చిన్నారావు ఆధ్వర్యంలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గండి రోహిణి, దాసరి ధనంజయ, దాసరి సత్యనారాయణ, తాడ్డి వెంకటరమణ, తుట్ట శ్రీరామ్, టి.గోవింద, శిష్టు వెంకటి రాంబార్కి, నారంనాయుడు తదితరులు ఉన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులమై తామంతా పార్టీలో చేరామని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాషా దినోత్సవం


షేక్ స్పియర్ గొప్పతనం వివరిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు దామోదరరావు, ఇతర ఉపాధ్యాయులంతా కలిసి ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్ల కవి, నాటక రచయిత విలియం షేక్ స్పియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు ఆంగ్ల సాహిత్యానికి షేక్ స్పియర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనో గొప్ప కవి అనడానికి నిదర్శనం.. ఆయన రాసిన నాటకాలన్నీ ప్రపంచ దేశాల్లోని అన్ని భాషలలో అనువదించబడ్డాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీభాను, సత్యనారాయన, కృష్ణ, ప్రసాద్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


పాపమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామానికి చెందిన ముద్దాడ నూకమ్మ, వంజరాపు పాపమ్మలు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మంగళవారం ఆ గ్రామానికి చేరుకుని, ఆయా కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, వాసుదేవపట్నం సర్పంచ్ పప్పల గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ


రామకృష్ణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ బొమ్మరిల్లు రామకృష్ణ.. వైఎస్సార్ సీపీలో మంగళవారం చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన ఆయనకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువా వేసి, సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనను కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగిస్తున్న సుపరిపాలన నచ్చే తాను పార్టీలో చేరానని, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానని రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

ఇద్దరికి మదర్ థెరీసా సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న విశాలాక్షి

వంగర: మండలంలోని ఇద్దరు ఏఎన్‌ఎంలకు మదర్ థెరీసా సేవారత్న అవార్డులు దక్కాయి. వంగర ఏఎన్‌ఎం బొత్స విశాలక్షి, అరసాడ ఏఎన్‌ఎం కటిక క్రిష్ణకుమారిలకు వారు అందించిన విశేష సేవలకు గాను మదర్ థెరీసా సేవా ఫౌండేషన్ ఈ అవార్డులను ప్రదానం చేసింది. ఈ మేరకు వారిని పీహెచ్‌సీ సిబ్బంది అభినందించారు.

ఎనిమిది నామినేషన్లలో నాలుగు టీడీపీవే..

రాజాం: రాజాం అసెంబ్లీ స్థానానికి దాఖలైన ఎనిమిది నామినేషన్లలో నాలుగు టీడీపీకి చెందినవి కావడం చర్చనీయాంశమైంది. నలుగురు అభ్యర్థులకు సంబంధించి, ఎనిమిది నామినేషన్లు దాఖలు కాగా వీటిలో నాలుగు టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌వి కావడం గమనార్హం. మంగళవారం కాంగ్రెస్ పార్టీ తరఫున కంబాల రాజవర్ధన్ నామినేషన్ వేయగా, స్వతంత్ర అభ్యర్థిగా గండి అప్పారావు నామినేషన్ దాఖలు చేశారు.

పుస్తక పఠనంతో అపారజ్ఞానం


పుస్తకాల ప్రదర్శనలో ఎంఈవోలు, లైబ్రేరియన్, విద్యార్థులు

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని, ప్రతిఒక్కరూ ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం చాలా మంచిదని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పుస్తక ప్రదర్శన చేపట్టి, పుస్తకాల గొప్పతనం వివరించారు. స్నేహితుల కన్నా పుస్తకాలే మనకు మేలు చేస్తాయని, మంచి పుస్తకాలను సేకరించి దాచిపెట్టుకుని విరామ సమయంలో చదవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు జె.త్రినాథరావు, పాపారావు పాల్గొన్నారు.

రెండు పూటలా పనులు చేయాలి


వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం వేతనదారులంతా రెండు పూటలా పనులు చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. తొలుత ఆయన మస్తర్లు పరిశీలించి, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పనులు జరిగే ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా ఉండేలా చూసుకోవాలన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని, మండలంలోని ఆమదాలవలస, రేగిడి, అంబఖండి, వన్నలి, గోపింపేట గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కొలువైన స్వామి వారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి కిన్నెర కాంతం అన్నారావు ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు కూడా చేసి, భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని బావిరేతమ్మ ఆలయం వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాన్ని సంప్రోక్షణ చేసి, నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకుని, అధిక సంఖ్యలో మహిళలు ముర్రాటలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం


కలశాలలతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న మహిళలు

తెర్లాం: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని వి.చిన్నయ్యపేటలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రారంభ పూజలు, విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలంతా ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు, గ్రామపెద్దల సమక్షంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.


రాజాం: పట్టణంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శంబంగి


మాజీ మంత్రి జగన్మోహనరావుతో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: పట్టణంలో మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావును వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చి, సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, మాజీ మంత్రి తనయుడు పెద్దింటి రామ్‌జీ ఉన్నారు.

2 ఇసుక ట్రాక్టర్ల సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ల వద్ద ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని బొబ్బిలి జంక్షన్, పాలకొండ జంక్షన్లలో మంగళవారం ఆకస్మిక దాడులు చేపట్టి, వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచి, ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన


బొబ్బిలి పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించి, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పర్యావరణ ఇంజినీర్, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో కలిసి మల్లమ్మపేట, ఆర్‌టీసీ కాంప్లెక్స్, కోటి చెరువు ప్రాంతాల్లో వెళ్లిన ఆమె ప్రతీ వార్డు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఇష్టానుసారం ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడానికి వీలులేదన్నారు. ముఖ్యంగా మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

వలంటీర్ల రాజీనామా


వంగర: రాజీనామా పత్రాలు చూపిస్తున్న రాజులగుమ్మడ వలంటీర్లు


తెర్లాం: నందిగాంలో రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు


రాజాం: రాజీనామా పత్రాలు అందజేస్తున్న రాజయ్యపేట వలంటీర్లు

వంగర: మండలంలోని రాజులగుమ్మడ గ్రామానికి చెందిన వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం తమ రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయ సిబ్బందికి అందించారు. ఇన్నాళ్లు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని వారు తెలిపారు.

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లంతా మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. అనంతరం తమ రాజీనామా పత్రాలను సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, ఎమ్మెల్యే శంబంగి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ విజయానికి కూడా కృషి చేస్తామన్నారు.

రాజాం: మండలంలోని రాజయ్యపేటకు చెందిన ఏడుగురు వలంటీర్లు, సోపేరుకు చెందిన ఆరుగురు వలంటీర్లు మంగళవారం రాజీనామ చేసినట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. వారంతా తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రాల్లో పేర్కొన్నారని ఆయన వెల్లడించారు. అలాగే ఇదే మండలంలోని నందబలగకు చెందిన ముగ్గురు, కొఠారిపురానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సీతల్‌వర్మ

కొత్తవలస: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళపాలెం గ్రామంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సీతల్‌వర్మతో పాటు గైనకాలజిస్టు పి.వరలక్ష్మి, ఆప్తాలమిక్ జ్యోతిప్రియ శిబిరంలో 365 మందికి సేవలందించారు. ఇద్దరిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది ఓ.నర్సింహరావు, రమణమ్మ, బేబిరాణి, సూరి దేమడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.